క్లుప్తంగా

శిశుగృహ పరిశీలన



శిశుగృహ వద్ద వేంకటశేషమ్మ, తదితరులు

మర్రిపాలెం : డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ బుధవారం శిశుగృహను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించి, అందుతున్న సదుపాయాలు పరిశీలించారు. ఆమెతోపాటు ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయాదేవి, మేనేజర్ ఎ.సుజాత, సోషల్ వర్కర్ ఎస్‌వీఎస్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

సీతమ్మధార : చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యం కాపాడుకోవచ్చని మేజిక్ బస్ సంస్థ ట్రైనింగ్ కమ్ మోనిటరింగ్ ఆఫీసర్ సురేంద్ర అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను పురస్కరించుకుని పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్)లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం ముందు, తర్వాత... వాష్ రూమ్‌కి వెళ్లిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు అపరిశుభ్రంగా ఉంటే బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లి పలు రోగాలకు కారణమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పైడి, పద్మలు, ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచితే సెయిల్‌లో విలీనం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో బుధవారం చేపట్టిన 1343వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని, ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకు కూడా అందుబాటులో ఉంచడం లేదని ఆరోపించారు. ఫలితంగా ఏటా నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, దీనికి కార్మికులను మానసికంగా వేధించడం, ఆర్థిక ప్రయోజనాల్లో కోతపెట్టడం దారుణమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎన్.రామారావు, శ్రీనివాస్ రెడ్డి, భానుమూర్తి, పెదిరెడ్ల నీలకంఠం, గంగాధర్, వెంకట్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా స్వర సంగమం

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ముగ్గురు గాయనీమణులు నిర్వహించిన 'త్రివేణి స్వర సంగమం'తెలుగు, హిందీ పాటలతో అలరించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా బుధవారం సంస్థ వ్యవస్థాపకులు నారీ-భేరీ సమర్పణలో సీవీ రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, శైలజ మీరాజ్ ముగ్గురు గాయనీ మణులు సంయుక్తంగా ఆలపించిన తెలుగు, హిందీ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని విశాఖ పోర్టు విశ్రాంత అధికారి హరినాథ్‌బాబు, డాక్టర్ ఉషా చీరాల, సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ సాంస్కృతిక రంగానికి ప్రతిష్ట తెస్తున్న ముగ్గురు గాయనీమణులు అందిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఎన్‌వీఆర్ నాగేశ్వరరావు, బంగారయ్య, పుండరీకుమార్, సురేష్ కన్నా, రాజు, రామ్, భూపతిరావు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి... ప్రారంభించడమే ఆలస్యం..!



జగన్నాథపురంలో రెండు అంతస్తుల్లో నిర్మించిన దోబీఘాట్, సామాజిక భవనం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- ఎన్నికల అనంతరం నిర్మాణాలన్నీ పూర్తి
- నేటికీ ప్రారంభించని పాలకులు, అధికారులు



సీతంపేట రెల్లివీధిలో కొత్తగా నిర్మించిన కల్యాణ మండపం



రజకుల కోసం నిర్మించిన దోబీఘాట్‌లు, కుండీలు, బల్లలు



శ్రీనివాసనగర్‌లో గెడ్డపై నూతనంగా నిర్మించిన బాక్సు కల్వర్టు

సీతంపేట : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తర నియోజకవర్గంలోని వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఎన్నికల ముందు మొదలైన కొన్ని అభివృద్ధి పనులు పూర్తయినా నేటికీ ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క అభివృద్ధి పని కూడా ప్రారంభించ లేదు సరికదా... కనీసం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. జీవీఎంసీ 25వ వార్డులో సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో బీటీ ఆర్ నగర్ రెల్లి వీధిలో రెండు అంతస్తుల్లో విశాలమైన కల్యాణ మండపం నిర్మించారు. పనులు పూర్తయి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఒకవైపు పెళ్లి ముహూర్తాలు వెళ్లిపోతున్నా కల్యాణ మండపం మాత్రం ప్రారంభించలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గతంలో రెల్లి వీధిలో ఉన్న సామాజిక భవనాన్ని సచివాలయానికి కేటాయించడంతో స్థానిక నివాసితుల శుభకార్యాలకు, సమావేశాలకు సరైన భవనం లేక ఇబ్బందులు పడ్డారు. సమస్యను అప్పటి వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లడంతో కల్యాణ మండపానికి ఆయన నిధులు మంజూరు చేయించారు.



హిందూ ముస్లిం కాలనీలో నిర్మించిన సామాజిక భవనం

త్వరితగతిన భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా రెల్లివీధి ప్రజల అవసరాలకు తగినట్టు విశాలమైన రెండు అంతస్తుల కల్యాణ మండపం సిద్ధమైంది. కానీ ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. శ్రావణ మాసం గడిచి పోయింది.., ఆశ్వీయుజమాసం నడుస్తోంది.., పెళ్లి ముహూర్తాలు వెళ్లిపోతున్నా కల్యాణ మండపం ఎప్పుడు ప్రారంభిస్తారా..? అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

- జీవీఎంసీ 25వ వార్డు హిందూ ముస్లిం కాలనీలో శిథిలమైన సామాజిక భవనాన్ని తొలగించి, దాని స్థానంలో రెండు అంతస్తుల సామాజిక భవనం నిర్మించారు. కాలనీలో నివసిస్తున్న హిందూ ముస్లింల అవసరాల మేరకు సౌకర్యంగా ఉండేలా సామాజిక భవనం నిర్మించారు. నేటికీ కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో స్థానికులకు అందుబాటులోకి రాలేదు
- జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలో ఏళ్ల తరబడి శిథిలమైన దోభీఖానాను పట్టించుకున్న నాథుడే కనిపించ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రజకుల వినతి మేరకు శిథిలమైన దోబీఖానా స్థలంలో రెండు అంతస్తుల్లో కొత్తది నిర్మించడానికి రూ.40.70 లక్షలు మంజూరు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రజకులు దుస్తులు ఉతికేందుకు సౌకర్యంగా దోబీఘాట్‌లు, సిమెంట్ బల్లలు, నీళ్ల కుండీలు, మోటార్ కనెక్షన్, నీటి సరఫరా ఏర్పాటు చేశారు. అలాగే మొదటి అంతస్తులో సామాజిక భవనం నిర్మించారు. రజకుల శుభకార్యాలు, సమావేశాలకు వినియోగించేలా భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది.
- జీవీఎంసీ 43వ వార్డులో 80 అడుగుల రోడ్ నుంచి శ్రీనివాసనగర్ బెల్లం రాములమ్మ వీధికి వెళ్లే మార్గంలో గెడ్డ కల్వర్టు కింద ఉన్న గోడలు శిథిలమై బ్రిడ్జి బలహీనమై ప్రమాదకరంగా మారడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. గతంలో కంటే విశాలమైన మార్గంలో వాహనాలు రాకపోకలు సాగించేలా బాక్సు కల్వర్టు నిర్మించారు. అప్రోచ్ రోడ్ కూడా వేశారు. ఇక ప్రారంభమే ఆలస్యం.

చినుకు పడితే బురదమయం

ఎన్‌ఎంసీహెచ్ హైస్కూల్ విద్యార్థులకు అవస్థలు



వర్షాలకు బురదమయంగా మారిన ఎన్‌ఎంసీహెచ్ మైదానం

సీతమ్మధార : స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్‌ఎంసీహెచ్) బురదమయంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే ఇక్కడి మైదానంలో నీరు నిలిచిపోవడంతో చెరువులా కనిపిస్తోందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సాధారణ రోజుల్లో పాఠశాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని విద్యార్థులు ఆట స్థలంగా వినియోగిస్తున్నారు. వర్షం కురిసే సమయంలో మాత్రం అక్కడ ఆటలు ఆడేందుకు విద్యార్థులు, ఆడించేందుకు ఉపాధ్యాయులు భయపడుతున్నారు. విద్యార్థులు రాకపోకలు సాగించే సమయంలో వారిపైకి బురద తుల్లుతోందని వాపోతున్నారు. ఈ హైస్కూల్‌లో సుమారు వెయ్యి మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వారంతా ఎప్పటికప్పుడు ఇబ్బంది పడుతున్నా మైదానం అభివృద్ధి చేసేందుకు మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ ఇంజినీర్లు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథా



పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధి 24వ వార్డులో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా అధిక పరిమాణంలో మంచినీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నక్కవానిపాలెంలో పైప్‌లైన్ లీకవుతున్న కారణంగా రోజూ నీరు వృథాగా కాలువలోకి పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడి క్రాంతినగర్ వీధి రోడ్డు మధ్యలోనూ పైప్‌లైన్ లీకవుతున్నా జోన్ – 3 మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నీటి వృథాను అరికట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్లు స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లైట్లు వెలుగుతున్నాయ్...

సాక్షి ఎఫెక్ట్..



సీతమ్మధారలో వెలుగుతున్న వీధి లైట్లు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు వెలుగులు పంచుతున్నాయి. కొద్ది రోజుల కిందట వీధిలైట్లు వెలగని వైనంపై 'ప్రతీ రాత్రీ అమావాస్యే' శీర్షికతో 'సాక్షి' పత్రికలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించారు. బాలయ్య శాస్త్రి లే అవుట్, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలు ఏరియా, వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంతాల్లో వీధిలైట్లకు కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయించారు. 'సాక్షి' కథనంతో అధికారులు స్పందించి లైట్లకు మరమ్మతులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నర్సుల ఎన్నికల కోలాహలం



అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న ఉషారాణి

మహారాణిపేట: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. కేజీహెచ్ క్లాక్ రూమ్‌లో నామినేషన్ల పర్వం కోలాహలంగా మారింది. అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి బి. శ్రీనివాసరావు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఒక ప్యానల్ నుంచి ఉషారాణి నామినేషన్ దాఖలు చేశారు. ఆమెతో పాటు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఇంకో ప్యానల్ నుంచి గంగా భవానీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 9 పోస్టులకు గాను 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్క సెక్రటరీ పోస్టుకి ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన అన్ని పోస్టులకు రెండేసి నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 555 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో రెండు ప్యానళ్లు పోటీ పడుతున్నాయి. అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, వైస్ ప్రెసిడెంట్‌తో పాటు ఐదుగురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ జరుగుతుంది. అనివార్యం అయితే ఈనెల 23న ఎన్నికలు నిర్వహించవలసి ఉంది.

ధరలు తగ్గించాలని ధర్నా



ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: సామాన్యులపై ఆర్థిక భారం పడుతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జోన్ ఆరిలోవ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి పాత ఆరిలోవ మీదుగా బాలాజీనగర్ వరకు ర్యాలీ చేశారు. పెరిగిన ధరలు అదుపు చేయాలని, పెరిగిన ధరలకు హద్దే లేదా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెంచి వారిపై మోయలేని ఆర్థిక భారం వేస్తోందని మండిపడ్డారు. ఉచిత ఇసుక హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలం గడుపుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక ఇవ్వడం లేదు సరికదా.. ఎన్నడూలేని ధరలకు ఇసుక అమ్ముకుంటున్నారన్నారు. దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, పుష్పలత, చిరంజీవి పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

- నియోజకవర్గంలో పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ



శ్రీనగర్ రోడ్డుపై డంపర్‌బిన్ నిండిపోవడంతో కిందపడేసిన వ్యర్థాలు



సీతమ్మధార రైతుబజార్ వద్ద నిండిపోయిన డంపర్‌బిన్



శ్రీనగర్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



పీ అండ్ టీ కాలనీ రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు

సీతమ్మధార : నియోజకవర్గంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దసరా సెలవులు ముగిసినా పారిశుధ్య సిబ్బంది జాడ కనిపించడం లేదని నియోజకవర్గ వాసులు మండిపడుతున్నారు. డంపర్‌బిన్లు నిండిపోయినా తరలించే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, గాంధీనగర్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, 27వ వార్డు రామాటాకీస్, శ్రీనగర్ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్, బాలయ్య శాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్ ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయని, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానిక నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హడలిపోతున్నారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని... శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఏం చేస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందితో చెత్త తరలించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. గురుద్వారా కూడలి సమీపంలో సివిల్ డిఫెన్స్ కార్యాలయం రోడ్‌లో, శాంతిపురం జిమ్ రోడ్‌లో చెత్త పేరుకుపోయింది. దసరా పండగ ముగిసినా పారిశుధ్యం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ప్రధాన రహదారుల్లో చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

47వ వార్డులో పారిశుధ్యం అధ్వానం

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలకు ఆనుకుని ఉన్న అరుంధతినగర్, కప్పరాడ, అంబేడ్కర్‌నగర్, బాపూజీనగర్, సంజీవయ్య కాలనీ, జై ప్రకాశ్‌నగర్, అల్లూరి సీతారామరాజు నగర్‌లో సక్రమంగా చెత్త తొలగించకపోవడంతో పేరుకుపోయింది. ఈ ప్రాంతంలో వాహనాలు నెలల తరబడి వదిలేయడంతో శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యంగా చెత్త తొలగిస్తున్నారు. ఆయా వీధుల నుంచి తరలించిన చెత్తను ఇక్కడే డంప్ చేస్తారు. ఈ మార్గంలో వినియోగించే పుష్ కార్ట్స్, డంపర్ బిన్లు తుప్పుపట్టడంతో చెత్త రోడ్లుపై వేస్తున్నారు. ఆ చెత్తను కుక్కలు, పశువులు చిందరవందరగా చేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. స్థానిక వార్డు కార్పొరేటర్, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాడ కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో వదిలేసిన వ్యర్థాలు, తుప్పుపట్టిన పుష్‌కార్టు బళ్లు గత నాలుగు నెలలుగా అక్కడే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తరలించమని సిబ్బందికి చెబితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని... ఫిర్యాదు చేసేందుకు శానిటరీ కార్యాలయానికి వెళ్తే అక్కడ అధికారుల జాడ కనిపించడంలేదని వాపోతున్నారు. సంబంధిత జోన్ – 5 కమిషనర్, పబ్లిక్ హెల్త్ అధికారులు స్పందించి చెత్త తొలగించాలని, తుప్పుపట్టిన పుష్‌కార్టులు తరలించాలని, కొత్త పుష్‌కార్టులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గురుద్వారా కూడలిలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



జీవీఎంసీ 47వ వార్డులో తుప్పపట్టడంతో పక్కన వదిలేసిన పుష్‌కార్టులు



రాంజీ ఎస్టేట్ పాఠశాలకు ఆనుకుని పేరుకుపోయిన చెత్త



శాంతిపురం రోడ్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో జి.రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. బుధవారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.